క్లుప్తంగా

ప్రకృతి వ్యవసాయంపై ఆసక్తి పెంచుకోవాలి

తాడేపల్లిగూడెం : ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచుకోవాలని డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన వర్సిటీ డీన్ ఆఫ్ హార్టీకల్చర్ ఏఎస్ పద్మావతమ్మ కోరారు. భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ప్రణాళికననుసరించి సేంద్రియ, ప్రకృతి వ్యవసాయంపై రెండు రోజుల పాటు సాగే శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. పద్మావతమ్మ మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయ పద్ధతుల ఆవశ్యకత, ప్రస్తుత వ్యవసాయ పద్ధతుల్లో చేపట్టాల్సిన విషయాలపై సూచనలు చేశారు. కేవీకే శాస్త్రవేత్త ఎం.రాఘవేంద్రరెడ్డి మాట్లాడుతూ సేంద్రియ కర్బన ప్రాముఖ్యత, జీవన ఎరువుల వినియోగంపై వివరించారు. డీపీఎం తాతారావు (ఏలూరు), ప్రకృతి వ్యవసాయ రైతుల విజయ గాథలను కొత్త రైతులకు తెలియజేశారు. శిక్షణలో భాగంగా మహిళా రైతులకు వెంకట్రామన్నగూడెం, నాచుగుంట, వెల్లమిల్లి, సింగరాజు పాలెంలలో ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను చూపించారు. క్షేత్రస్థాయి విషయాలను ఆకళింపు చేసుకుంటే రైతులకు మేలు జరుగుతుందన్నారు. కేవీకే శాస్త్రవేత్తలు ఎ.దేవీవరప్రసాద రెడ్డి, కె.వెంకటసుబ్బయ్య, మొహమ్మద్ వలి, అడిషినల్ డీపీఎం విజయకుమారి పాల్గొన్నారు.

కె సముద్రపుగట్టు ఉపసర్పంచ్ పదవికి రాజీనామా

అత్తిలి: మండలంలోని కె సముద్రపుగట్టు ఉపసర్పంచ్ యాళ్ల అనిత తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాల వల్ల ఉపసర్పంచ్ పదవికి రాజీనామ చేశానని, రాజీనామా పత్రాన్ని ఎంపీడీవో ఎండీ అమీలుజమాకు బుధవారం అందజేసినట్లు మండల పరిషత్ కార్యాలయ అధికారులు పేర్కొన్నారు.

బంగారు భవిష్యత్‌కు పాఠశాలలే పునాది

తాడేపల్లిగూడెం: విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు పాఠశాల దశలోనే పునాది వేసుకోవాలని నిట్ సెర్బ్ ప్రిన్సిపల్ ఇన్వెస్టిగేటర్ శ్రీఫణికృష్ణ కర్రి అన్నారు. నిట్ ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్ విభాగం, సెర్బ్ సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం సైంటిఫిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమం నిర్వహించారు. ఫణికృష్ణ మాట్లాడుతూ నూతన పరిశోధనలతో కొత్త శిఖరాలను అధిరోహించాలన్నారు. విభిన్నమైన ఆలోచనలు ప్రతి ఒక్క విద్యార్థి జీవితంలో భాగం కావాలన్నారు.ఈ కార్యక్రమంలో ఆచార్యులు వి.సందీప్, టి.రమేష్, పి.శంకర్, కిరణ్ తీపర్తి తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం


తాడేపల్లిగూడెం రూరల్: వాలీబాల్ పోటీలను ప్రారంభిస్తున్న సంపత్‌కుమార్


తణుకు టౌన్: వేల్పూరులో వాలీబాల్ ఆడుతున్న మహిళలు

తాడేపల్లిగూడెం రూరల్: క్రీడల ద్వారా ఉత్సాహం... ఆరోగ్యం లభిస్తాయని ఏఎంసీ చైర్మన్ ముప్పిడి సంపత్‌కుమార్ అన్నారు. ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీల్లో భాగంగా బుధవారం మండలంలోని మాధవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో వాలీబాల్, కబడ్డీ పోటీలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏఎంసీ చైర్మన్ సంపత్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత హడావిడి జీవితంలో శారీరక మానసిక వికాసానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. ప్రతి ఒక్కరిలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేందుకు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రాష్ట్రంలోని 175 నియోజకవర్గాల్లోనూ ఆడుదాం ఆంధ్ర ఆటల పోటీలను ప్రారంభించినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారులను ప్రోత్సహించడానికి ఈ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. ఈ క్రీడల ద్వారా జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు తెచ్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ జడ్డు హరిబాబు, వెంకట్రావు పాలెం సర్పంచ్ ఎలిపే గాంధీ, ఏఎంసీ మాజీ డైరెక్టర్ తమ్మిశెట్టి చుక్కయ్య, పంచాయతీ కార్యదర్శి ఆర్‌వీ.బ్రహ్మం తదితరులు పాల్గొన్నారు. కృష్ణాయపాలెంలో కంఠమని సత్యనారాయణ, నక్కా గంగాధర్, గజ్జరపు రామకృష్ణ, పుట్టా ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.


పెంటపాడు: మీనవిల్లూరులో మారథాన్ యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర క్రీడాపోటీలు

అత్తిలి: ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం ఆరవల్లి, బల్లిపాడు, కొమ్మర, అత్తిలి గ్రామాల్లో గల జెడ్పీ ఉన్నత పాఠశాలల క్రీడా ప్రాంగణాలలో బుధవారం క్రీడా పోటీలు జరిగాయి. వాలీబాల్, షటిల్, క్రికెట్, ఖోఖో పోటీల్లో క్రీడాకారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. మండల ప్రత్యేక అధికారి కె మురళీకృష్ణ, ఎంపీడీవో అమీలుజమా క్రీడాపోటీలను పర్యవేక్షించారు. క్రీడాకారులను పరిచయం చేసుకుని క్రీడలను ప్రారంభించారు.

రెండో రోజూ ఉత్సాహంగా ఆడుదాం ఆంధ్ర క్రీడోత్సవాలు

తణుకు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం తణుకు మండలంలోని వివిధ గ్రామాల్లోని క్రీడా పోటీలు రెండవ రోజూ కొనసాగాయి. బుధవారం తణుకు మండలంలోని వేల్పూరు, దువ్వ, మండపాక, తేతలి తదితర గ్రామాల్లో రెండో రోజు వాలీబాల్, షటిల్ బాడ్మింటన్ పోటీల్లో యువత ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గ్రామ కార్యదర్శులు వీ గంగాధరరావు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

క్రీడలతోనే మంచి ఆరోగ్యం

పెంటపాడు: మండలంలో రెండో రోజు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఉత్సాహభరితంగా సాగింది. మొదటి రోజు కన్నా రెండోరోజు యువత అన్ని గ్రామాల్లో పాల్గొని క్రీడల్లో సత్తా చాటారు. మీనవిల్లూరు జెడ్పీస్కూల్లో కొండేపాడు, రామచంద్రపురం యువత నాయకులు మారథాన్ యాత్ర నిర్వహించారు. పార్టీ బీసీసంఘ నాయకులు లింగమూర్తి, కొండేపాడు సర్పంచ్ కట్టా దానయ్య తదితరులు మాట్లాడుతూ గ్రామీణ క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు.

నవరత్నాలతో సంక్షేమ వెలుగులు

తాడేపల్లిగూడెం అర్బన్: ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి రూపొందించిన నవరత్నాల పథకాలు లబ్ధిదారులకు ఆర్థిక ప్రయోజనాన్ని అందిస్తున్నాయని పట్టణ కన్వీనర్ కర్రి భాస్కరరావు తెలిపారు. బుధవారం పట్టణంలో 28,30,31,32 వార్డుల్లో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ నవరత్నాలు, ఇతర సంక్షేమ పథకాలు సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారన్నారు. మళ్లీ ఈ పథకాలు కొనసాగలంటే మళ్లీ జగన్‌ను సీఎం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలనతో పాటు గ్రామల అభివృద్ధికి పెద్దపేట వేస్తున్నారని అన్నారు. రాబోయే ఎన్నికలలో వైఎస్సార్ సీపీకి ఘన విజయం అందించాలని కోరారు. జగన్ సహకారంతో నియోజకవర్గాన్ని వందలకోట్ల రూపాయలతో అభివృద్ధి చేస్తున్న ఉపముఖ్యమంత్రి, దేవదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణను ఎమ్మెల్యేగా గెలిపించేందుకు నియోజకవర్గ ప్రజల సిద్ధంగా ఉన్నారన్నారు. రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి ప్రజా రక్షణకు అహర్నిశలు పాడుపడుతున్న నాయకుడు కొట్టు అని తెలిపారు. ఈ కార్యక్రమంలో శీలి మేరీ కుమారి, షఫీ, వట్టి బుజ్జి, కావని అశోక్, పట్నాల గణపతి, పొట్లపల్లి రాంబాబు, కోడే అప్పారావు, మారిశెట్టి రమణ పందిరిపల్లి రామయ్య, స్థానిక మహిళలు, వలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


32వవార్డులో సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

గూడెం ఎంఎల్ఎస్ పాయింట్‌లో విజిలెన్స్ తనిఖీలు

పెంటపాడు: మండలంలోని ప్రత్తిపాడులో ప్రభుత్వం చౌకడిపోలకు పంపిణీ చేసే పౌరసరఫరాల గోదాములను(ఎంఎల్ఎస్ పాయింట్) బుధవారం అకస్మిక తనిఖీలు జరిగాయి. ఈ సందర్భంగా విజిలెన్స్ డీఎస్పీ సి. వెంకటేశ్వరరావు, విజిలెన్స్ తహసీల్దార్ కన్యాకుమారిలు చౌకడిపోలకు అందించే బియ్యం, అంగన్‌వాడీ సెంటర్‌లకు అందించే సరుకుల నాణ్యతను, స్టాక్‌ను పరిశీలించారు. ఉన్న స్టాక్‌కు రిజిస్టర్ నమోదు అయిన స్టాక్‌కు సరిపోవడంతో సంతృప్తి వ్యక్తం చేసారు. ఈ దాడుల్లో సిబ్బంది, గోదాముల నిర్వాహకులు పాల్గొన్నారు.

తణుకు నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా సప్పా

తణుకు అర్బన్: తణుకు వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు సప్పా బలరామకృష్ణ తణుకు నియోజకవర్గ గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా బుధవారం రాష్ట్ర పౌరసరఫరాలు, వినియోగదారుల వ్యవహారాల శాఖ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఎమ్మెల్సీ వంకరవీంద్రనాథ్‌లు అభినందించారు. ఈ సందర్భంగా బలరామకృష్ణ మాట్లాడుతూ తనకు ఈ పదవి అప్పగించిన మంత్రి కారుమూరికి కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ మాజీ చైర్మన్ చిట్టూరి శ్రీవెంకట సుబ్బారావు, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు మంగెన సూర్య పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత

పెంటపాడు: పేద ప్రజలకు వెఎస్సార్ సీపీ ప్రభుత్వం అండగా ఉంటుందని పెంటపాడు గ్రామ సర్పంచ్ తాడేపల్లి సూర్యకళ పేర్కొన్నారు. పెంటపాడు కునాకరపేటకు చెందిన వంకా శ్రీనివాసరావు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. అతనికి వైఎస్సార్ బీమా వర్తింపు కార్యక్రమంలో భాగంగా రూ. 2 లక్షలు అందించేందుకు స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులు ఏర్పాట్లు చేశారు. మట్టి ఖర్చుల కోసం తక్షణసాయంగా రూ.10వేలు బుధవారం ఆమె భార్య కనకలక్ష్మికి అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కొవ్వూరి ప్రసాద్‌రెడ్డి, ఎంపీటీసీ సభ్యులు రెడ్డి సూరిబాబు, వార్డు సభ్యులు బర్ల జయరాం బాబు, రెడ్డి సూరిబాబు, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడిగా హరిబాబు

తాడేపల్లిగూడెం రూరల్: వైఎస్సార్ సీపీ తాడేపల్లిగూడెం మండల నూతన కార్యవర్గాన్ని నియమిస్తూ జిల్లా పార్టీ ఉత్తర్వులు జారీ చేసింది. మండల పార్టీ అధ్యక్షుడిగా జడ్డు హరిబాబు, ఉపాధ్యక్షుడిగా మేణ్ణి రామారావు, ఎం.వెంకటేశ్వర రెడ్డి, కార్యదర్శులుగా చిట్టూరి కాశీవిశ్వనాథం, మద్దుకూరి మెహెర్‌ప్రసాద్, పాకనాటి తాతాజీ, గంటి సర్వేశ్వరరావు, పత్సా వీరవెంకట్రాజు, సంయుక్త కార్యదర్శులుగా అడ్డాల గోపీకృష్ణ, కల్లేపల్లి బలరామకృష్ణంరాజు, కంకట రాజారత్నం, మర్లపాటి వెంకటరత్నం, పెండెం భాస్కరరావు, తాడేపల్లి మోషే, గజ్జరపు రామకృష్ణ, ములకాల చినశ్రీనులు నియమితులయ్యారు.

ఈవీఎంలపై అవగాహన

తణుకు టౌన్: పట్టణ, గ్రామాల్లో ఓటర్లు ఈవీఎం, వీవీ ప్యాట్లపై సందేహాలను నివృత్తి చేసుకొనేందుకు అవగాహన కేంద్రాలను వినియోగించుకోవాలని తహసీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్ కోరారు. బుధవారం దువ్వ, తేతలి గ్రామాల్లో పోలింగ్ కేంద్రాల వద్ద అవగాహన సదస్సులు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌వో ఏ గోవర్ధనరావు, డిప్యూటీ తహసీల్దార్ సూర్యనారాయణరాజు, వీఆర్‌ఓలు నిమ్మలపూడి సుధాకర్, ఎం వెంకటేష్, దువ్వ, తేతలి గ్రామాలకు చెందిన ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.